

# అసలు విషయం

అరవయ్యేళ్ళ వయసు వాడయినా అలా కనిపించక, నలభైయ్యేళ్ల వాడిలా ఉంటూ యౌవనంగా, హుషారుగా, చెలాకీగా ఉండే ఆనందయ్య మంచం పట్టడం, పెద్ద చదువులకై ఊళ్లకి వెళ్ళిన తన ముగ్గురు మగ పిల్లలకీ ఆశ్చర్య మనిపించింది. కనీసం తల నొప్పయినా వచ్చి ఎరుగని ఆనందయ్య మరణావస్థతో సతమత మవుతున్నాడని - తమని వెంటనే బయలుదేరి రమ్మని రాసిన ఉత్తరాలు - మరీ ఆశ్చర్యం, విచారం కలిగించి పరుగున పక్షుల్లా రెక్కలు కట్టుకు వాలిన కొడుకులు రామనాథం, సోమనాథం, రంగనాథం, తండ్రి స్థితిని, ఆతని అవస్థను చూసి దిగ్భ్రాంతి చెందారు. "తాము రెండు నెలల క్రితం వచ్చినప్పుడు తండ్రి బాగానే హాయిగా, ఆనందంగా, చలాకీగా తిరుగుతున్నాడే - ఇంతలో ఏమయిందబ్బా? వైద్యుడు కూడా ఆయనలో ఏం రోగం లేదని కచ్చితంగా చెప్పాడు!" అని ఒకరినొకరు ప్రశ్నించుకుంటూ ముగ్గురూ కలిసి ఏకాంతంగా ఆలోచించసాగారు - తండ్రికి వినబడకుండా.

ఆఖరి వాడు రంగనాథం, "అన్నలారా, మీరేం కంగారు పడకండి! 'అసలు విషయం' ఆరాదీసి, రోగానికి తగ్గ మందు నేను వేసి, నాన్నకు నయం చేసి, తిరిగి మామూలు మనిషిని చేస్తాను!" అన్నాడు ఆఖరిగా.

"సరే తమ్ముడూ! మన ముగ్గురిలో నీవే కాస్త ఎక్కువ తెలివైన వాడివి కూడా!" అన్నారు తమ్ముణ్ని ప్రోత్సాహిస్తూ.

రంగనాథం తల్లిని పక్కకు తీసుకు వెళ్లి, ఎన్నో విషయాలు ఆరాదీసాడు. తల్లి ఆశ్చర్యపోతూనే అన్నీ చెప్పింది. గత రెండు నెలలుగా జరిగినవన్నీ విని, రంగనాథం విషయం గ్రహించి, ఆలోచించి ఓ ఉపాయం పన్నాడు.

శ్రీమతి జి. రామలక్ష్మి, హైదరాబాదు.



ఓ వారం గడిచినా, తండ్రి పరిస్థితిలో మార్పు లేదు; అలాగే ఉన్నాడు. అందరూ కల్సి హాలులో తండ్రి ప్రక్కన కూర్చున్నారు. పక్కన తల్లి కూడా ఉంది. "బాబూ! జోస్యం చెప్తానండి, జోస్యం! ఉన్నది ఉన్నట్లుగా, లేనిది లేనది లేనట్లుగా, నమ్మకంగా, కళ్ళకు కట్టినట్లుగా, అంతా నిజంగా చెప్పగలనండి... జోస్యం బాబూ, జోస్యం!" అంటూ ఓ కొండ దొర ఇంటి ముందు ఆగి పిలవసాగాడు.

"వెళ్ళవయ్యా వెళ్ళు; మా తల రాత బాగో లేక మేము ఏడుస్తోంటే, మధ్య నీ జోస్యం ఎవరికాక్కవాలి?..." అంది తల్లి రాములమ్మ.

"పోవయ్యా...పో..." చీదరించుకున్నారు పిల్లలు ముగ్గురూ. రంగనాథమయితే, తలుపు వేసేయబోయాడు!

"నాయనా, రంగనాథం! ఆ కొండదొరని పిలు నాయనా! నాకు 'జోస్యం' చెప్పించుకోవాలని ఉంది" అన్నాడు ఆనందయ్య మంచం మీద చచ్చీ చెడీ లేచి కూర్చుంటూ!

"ఎందుకు నాన్నా వాడు? వాడి మొఖం వాడేం చెప్తాడు?" అన్నాడు రంగనాథం.

"పోనీ పిలవరాదురా - ఆయన తృప్తి కోసం!" అన్నలు అన్నారు రంగనాథాన్ని మందలిస్తున్నట్లుగా.

"అయ్యగారు మంచాన్న పడ్డారు. ఆరు వారాల నుంచి, అప్పుడే నేర్చుకొంటున్న కొండ వాడొకడు వచ్చి జోస్యం చెప్పింది నమ్మి, నిజమని భ్రమించి మంచానకరుచుకు పోయిందు, నే రాసిస్తా - ఇంకా మూడు పదుల వయసు బతికుంటాడని. మా రాజు జాతకం మా గొప్పది. ముగ్గురు మగ పిల్లల ఈ తండ్రికి ఎనుబదేళ్ళు నిండందే చావు రాదు; ఇది మా కొండ దొరసాని కొండ దేవర ఆజ్ఞ!" అన్నాడు.

"ఆఁ, నిజమా!" అంటూ చటుక్కున లేచి కూర్చున్నాడు ఆనందయ్య.

"అవును; నా మాట నిజం. ఈ తాయత్తు కట్టి మళ్ళీ వారమాగి వస్తా - చూడు - నీ వెలా లేచి తిరుగుతావో!" అంటూ తాయత్తు కట్టి వెళ్ళాడు - ఆ కొండదొర.

ఆనందయ్య రోగం నయం అయింది,

మళ్ళీ మామూలు మనిషయ్యాడు; కులాసాగా పొలం పనులు చూసుకోసాగాడు.

తిరుగు ప్రయాణంతో "నాన్న జోస్యం నమ్మే మంచాన పడ్డాడు; తిరిగి ముల్లును ముల్లుతోనే తీసినట్లు అసలు సంగతి అమ్మ ద్వారా ఆరాదీసి, నా స్నేహితునికి ఎలా, ఏం, చేయాలో నేర్పి జోస్యం చెప్పించాను. మొదటి వాడు ఆరు నెలల్లో చస్తావని చెప్పగానే నమ్మి, నిజమనుకుని లేని రోగం, నీరసం, తెచ్చుకుని మరీ చావటం తప్పదన్నట్లుగా మంచం ఎక్కాడు నాన్న. నేను మరో జోస్యం ద్వారా ఎనభై ఏళ్ళు పోయిస్తూ, దొంగ తాయెత్తు కట్టించి, దీర్ఘాయుస్సు అని చెప్పించేసరికి ఈ జోతిష్కుడి మాట నిజం - అని అనుకుని, తనకు తానే అన్నేళ్ళ ఆయుస్సు తనకుండగా, ఈ రోగమేమిటి మధ్యలో ?" అని అనుకుని తినీ, త్రాగీ బాగా కోలుకున్నాడు. అదీ సంగతి. ఇంతకీ అతను నా స్నేహితుడే అనీ నాన్నకు తెలియదు!" అంటూ నిజం చెప్పాడు అన్నలతో రంగనాథం.

"పోనీలే తమ్ముడూ, మంచి పని చేసావ్; తెలివిగా ముల్లును ముల్లుతోనే నయం చేసి రోగం కుదిర్చావ్!" అని అన్నలు అభినందించారు. "అందుకే ,జోస్యమన్నది కరెక్టుగా ఎవరూ ఎవరికీ చెప్పలేరు. అందులోను ఆయువు విషయంలో మరీను! కాబట్టి ఎవరేం చెప్పినా నమ్మేయ కూడదు. ఎవరి రాతను ఎవరూ చదవలేరు; సవరించలేరు. పొట్ట కోసం రోడ్ల మీద తిరిగే ఈ చిలుక జోస్యము, కొండ జాతులు, కోకొల్లలు! వారి ఉచ్చుల్లో పడిన వారి గతి నాన్నలాగే ఉంటుంది" అన్నాడు రంగనాథం.

రంగనాథం చెప్పినదంతా విని "అవును, నీ తెలివి అమోఘం !" అని తమ్ముణ్ణి ఎంతగానో మెచ్చుకుని సంతోషించారు ఇద్దరు అన్నలు,

